సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 16 । జూలై । 2023



‘హైర్’ డ్రైవర్ల మెరుపు సమ్మె

కొత్తగూడెం ఆర్టీసీ డిపో పరిధిలో అద్దె బస్సులను నడిపే డ్రైవర్లు శనివారం తెల్లవారుజాము నుంచి మెరుపు సమ్మెకు దిగారు. 8లో



ముదురుతున్న పోరు

ఇల్లెందు మున్సిపాలిటీలో వర్గపోరు ముదురుతోంది. వైస్ చైర్మన్‌కు అందిన షోకాజ్ నోటీసుపై కలెక్టరేట్‌లో సంజాయిషీ అందజేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
28° / 24°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడవచ్చు.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముంపు ప్రాంతాల్లో ఏఎస్పీ పరిశీలన



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఎస్పీ

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని గోదావరి ముంపు ప్రాంతాలను భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ శనివారం పరిశీలించారు. గతేడాది వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని సున్నంబట్టి గ్రామస్తులకు సూచించారు. వరదల సమయంలో అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. ఆయన వెంట సీఐ దోమల రమేష్, ఎస్సైలు నర్సిరెడ్డి, కిశోర్ ఉన్నారు.

పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌గా స్వామి



నూతన కమిషనర్ ఎ.స్వామి

పాల్వంచ: పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌గా మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామిని బదిలీ చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ గ్రేడ్–2 మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న సీహెచ్.శ్రీకాంత్‌కు గ్రేడ్–1 అధికారిగా ఉద్యోగోన్నతి కల్పించి రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సౌత్ ఇండియాలో పాల్వంచకు 11 ర్యాంక్ వచ్చేలా శ్రీకాంత్ విశేష కృషి చేశారు. పాలకవర్గం లేకున్నా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించేవారు. తెల్లవారుజామున సైతం సిబ్బందితో సహా పట్టణంలో పర్యటించి సమస్యాత్మక ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేయించేవారు.

తాలిపేరుకు మళ్లీ వరద ఉధృతి



తాలిపేరు నుంచి విడుదలవుతున్న వరదనీరు

చర్ల: చర్ల మండలంలోని పెదమిడిసిలేరు సమీపంలో గల తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి మళ్లీ పెరిగింది. ఎగువ నుంచి వరద వస్తుండడంతో శనివారం సాయంత్రం మూడు గేట్లు ఒకడుగు మేర ఎత్తి 1744 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. గురువారం భారీగా వచ్చిన వరద శుక్రవారం తగ్గుముఖం పట్టగా, శనివారం సాయంత్రం నుంచి మళ్లీ పెరుగుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకొని నీటిమట్టాన్ని 72.12 మీటర్లుగా కొనసాగిస్తున్నారు.


పెద్దమ్మతల్లి ఆలయంలో నేడు రుద్రహోమం

పాల్వంచరూరల్ : పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు జరిగే ఈ హోమంలో కూర్చునే పురుషులు పంచె, కండువా, మహిళలు చీరలు ధరించి హాజరు కావాలని సూచించారు.

నా వయస్సు 58 ఏళ్లు !

సండే స్పెషల్

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి రాముల వారి దర్శనం ఒకప్పుడెంతో కష్టం. అప్పట్లో వాహన రాకపోకలు ఉండేవి కావు. ఏటా శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాలకు వివిధ ప్రాంతాల భక్తులు భద్రాచలం గోదావరి అవతల బూర్గంపాడు మండలం గొమ్మూరు నుంచి కాలినడకన, ఆపై పడవలో ప్రయాణించేవారు. అలా వస్తున్న 150 మంది భక్తులు ఓసారి నీట మునిగి కన్నుమూయడంతో వారధి నిర్మాణం ఆవశ్యకతను పాలకులు గుర్తించారు. ఈమేరకు గోదావరిపై నిర్మించిన వంతెనను ప్రారంభించి ఈ నెల 13న 58 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వారధి స్వగతం ఇలా..! – భద్రాచలం అర్బన్



భద్రాచలంలో గోదావరిపై బ్రిడ్జి, పక్కన కొత్త బ్రిడ్జి నిర్మాణానికి జరుగుతున్న పనులు

- లక్షలాది మంది రాకపోకలకు సహకరించా..
- అయినా నాలో సత్తా తగ్గలేదు
- మిత్రుడు కూడా అందుబాటులోకి వస్తే తగ్గనున్న భారం

భద్రాద్రిలో గోదావరిపై వారధి స్వగతమిది !!

ఆ ప్రమాదంతో వంతెనకు శ్రీకారం...

అప్పటికి నేను లేను కానీ.. 1959లో శ్రీరామనవమి ఉత్సవాలకు భక్తులు రెండు పడవలను కట్టుకుని గోదావరి నదిపై భద్రాచలం వైపు వస్తుండగా మునిగిపోయారట. ఆ ఘటనలో సుమారు 150 మంది నీట మునిగి చనిపోగా అప్పటి ప్రభుత్వం గోదావరి నదిపై నా నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఆనాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి శంకుస్థాపన చేయగా.. డిజైన్, నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలను ముంబైకి చెందిన పటేల్ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్‌కు అప్పగించారు. 1959 డిసెంబర్ 16న నీలం సంజీవరెడ్డి శంకుస్థాపన చేయగా, 1965 జూలై 13న రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రారంభించారు. అంటే ఆరేళ్ల సమయం పట్టింది.

ఎన్నో వరదలను చూశా..

గోదావరి వరద గత ఆరున్నర దశాబ్దాల్లో 11సార్లు తొలి ప్రమాద హెచ్చరికను దాటింది. జూలైలోనే గోదావరి 11సార్లు తొలి ప్రమాద హెచ్చరికను దాటడమే కాకుండా ఇందులో నాలుగుసార్లు తుది ప్రమాద హెచ్చరికను (53అడుగులు) సైతం దాటడం గమనార్హం. 1972 జూలై 6న 44.3 అడుగుల గోదావరి నీటిమట్టం నమోదైంది. 1976 జూలై 22న 63.9 అడుగులు, 1988 జూలై 29న 54.3, 2002 జూలై 27న 45.8, 2008 జూలై 6న 47.3, 2013 జూలై 19న 57, 2013 జూలై 24న 56.7, 2016 జూలై 12న 52.4 అడుగుల నీటిమట్టం నమోదైంది. కాగా గత ఏడాది జూలై 16న 71.3 అడుగులుగా నమోదైంది. ఇలా ఎన్నో వరదలతో పాటు గోదావరి ఎండిపోయి ఇసుక తిన్నెలు తేలడాన్ని కూడా చూశాను.



సారపాక–భద్రాచలం బ్రిడ్జి ద్వారం, అటు ఇటూ శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలా ఫలకాలు

రూ.70 లక్షలతో నిర్మాణం

భద్రాచలం వద్ద గోదావరి నదిపై నా నిర్మాణానికి రూ.70లక్షలు వెచ్చించారట! 3,934 అడుగుల పొడవు, 37 పిల్లర్లు, ఒక్కో పిల్లర్ మధ్య 106.6 అడుగుల దూరంతో నిర్మించారు. ఇప్పటికీ నేను పటిష్టంగానే ఉన్నాను. లక్షల వాహనాలు.. అంతకు మించి భక్తుల రాకపోకలకు వారధిగా నిలిచాను. అయినా ఏనాడూ మొరాయించలేదు.. ఎవరినీ ఇబ్బంది పెట్టలేదు. నాకు ఇంకా సామర్థ్యం ఉన్నా.. జాతీయ రహదారి కావడంతో భవిష్యత్ అవసరాల దృష్ట్యా పక్కనే మరో మిత్రుడి(బ్రిడ్జి) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను అనుసంధానం చేసేలా ఈ బ్రిడ్జి పనులు 2015 ఏప్రిల్‌లో మొదలుకాగా.. సుమారు రూ.100కోట్ల వ్యయమవుతుందని అంచనా వేయగా ముంబైకే చెందిన రాజ్‌దీప్ సంస్థ రూ.65 కోట్లతో పనులను దక్కించుకుంది. రకరకాల కారణాలతో ఆలస్యమవుతూ వస్తుండడంతో ఓసారి కాంట్రాక్ట్ సంస్థకు రూ.6.50 కోట్ల జరిమానా విధించి వసూలు చేశారట. చివరకు గడువు పెంచి సదరు సంస్థతోనే ఇంజనీరింగ్ అధికారులు పనులు చేయిస్తుండడంతో 90 శాతం మేర పూర్తయ్యాయి. ఈ బ్రిడ్జి కూడా త్వరగా పూర్తయితే నాపై భారం తగ్గి మరికొన్నాళ్లు భక్తులు, ప్రయాణికులకు సేవలందించే అవకాశం దక్కుతుంది.

నాలుగు రాష్ట్రాల ప్రజలకు సేవ..

భద్రాచలం పట్టణంలో గోదావరిపై 1965లో నిర్మించిన నా ద్వారా నాలుగు రాష్ట్రాల ప్రజల రవాణా కోసం సేవలందిస్తున్నా. ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వచ్చివెళ్లే వారికి 58 ఏళ్లుగా వారధిగా నిలుస్తున్న చరిత్ర నా పేరిట ఉంది. అప్పుడప్పుడు చిన్న చిన్న మరమ్మతులు తప్ప ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. కాకపోతే 1986లో మొదటిసారి 75.6 అడుగుల వరద వచ్చినప్పుడు ఉన్నతాధికారులు రాకపోకలను నిషేధించారు. మళ్లీ గత ఏడాది కూడా దాదాపు 35 ఏళ్ల తర్వాత భారీగా వరద రావడంతో రాకపోకలను అనుమతించలేదు. ఆ తర్వాత వరద తగ్గగానే మళ్లీ సేవలందిస్తున్నా.

‘భద్రాద్రి’ సుపరిచితమే !

- గతంలో ఈ జిల్లాకు చాలాసార్లు వచ్చా
- గ్రామీణ జిల్లాలో పని చేయడం గొప్ప అవకాశం
- బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ప్రియాంక



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక అల

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి జిల్లా తనకు సుపరిచితమేనని, గతంలో ఈ జిల్లాకు చాలాసార్లు వచ్చానని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. జిల్లా అధికారుల సమీకృత కార్యాలయం (ఐడీఓసీ)లో శనివారం సాయంత్రం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఐడీఓసీ ప్రాంగణమంతా కలియదిరిగారు. ఇదే క్యాంపస్‌లో ఉన్న కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని సైతం కుటుంబసభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు.

బంధుత్వం ఉంది

తనది తెలంగాణేనని, పుట్టి పెరిగింది అంతా హైదరాబాద్‌లోని ఉప్పల్ అని కలెక్టర్ తెలిపారు. స్థానికురాలినే కావడంతో ఈ రాష్ట్రం, ఇక్కడి జిల్లాలపై అవగాహన ఉందన్నారు. పైగా భద్రాద్రి జిల్లాలో బంధువులు కూడా ఉన్నారని, చిన్నప్పుడు చాలా సార్లు ఈ జిల్లాకు వచ్చానని గతాన్ని గుర్తు చేసుకున్నారు. 2016లో ఐఏఎస్‌గా ఎంపికైన తర్వాత యాదాద్రి భువనగిరి జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా, హైదరాబాద్ నగర పరిధిలో అడిషనల్ కమిషనర్, జోనల్ కమిషనర్‌గా పని చేసినట్టు తెలిపారు. తన సర్వీసులో పని చేసిన రెండూ అర్బన్ ప్రాంతాలని, తొలిసారిగా గ్రామీణ ప్రాంత జిల్లా అధికారిగా రావడం సంతోషంగా ఉందని చెప్పారు. పైగా ఈ జిల్లాలో గిరిజన జనాభా ఎక్కువగా ఉందని, ప్రభుత్వం తరపున వారికి చేయాల్సింది ఎంతో ఉందని అన్నారు.

చాలా చేయొచ్చు..

ఇక్కడికి బదిలీ అయిందని తెలియగానే జిల్లాకు సంబంధించిన విషయాలు తెలుసుకునే పనిలో పడ్డానని చెప్పారు. ఇంతకాలం ఇక్కడ కలెక్టర్‌గా పని చేసిన అనుదీప్ దురిశెట్టి తనకు ఫోన్ చేసి.. రాష్ట్రంలోనే ఆదివాసీలు అధికంగా నివసించే జిల్లాకు కలెక్టర్‌గా వస్తున్నందుకు శుభాకాంక్షలు తెలిపారని చెప్పారు. కలెక్టర్‌గా ఈ జిల్లాకు చాలా పనులు చేయొచ్చని, బదిలీపై వెళ్తున్న తనకు ఈ జిల్లా ఎంతో సంతృప్తిని ఇచ్చిందని అన్నారని తెలిపారు.

4:23 గంటలకు

హైదరాబాద్ నుంచి నేరుగా కొత్తగూడెం ఐడీఓసీకి శనివారం సాయంత్రం కలెక్టర్ చేరుకున్నారు. ఐడీఓసీ మొదటి అంతస్తులోని కలెక్టర్ చాంబర్‌కు చేరుకుని ఆసీనులయ్యారు. సాయంత్రం 4:23 గంటలకు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. వైద్య విద్యను అభ్యసించిన తాను ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో సివిల్ సర్వీస్‌లోకి వచ్చినట్లు తెలిపారు. కలెక్టర్‌కు వివిధ శాఖల అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. తమను తాము పరిచయం చేసుకున్నారు. కలెక్టర్ ప్రియాంక అలా వెంట అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, అన్ని ప్రభుత్వ శాఖ జిల్లా అధికారులు ఉన్నారు.

ఎంబీబీఎస్ టు సివిల్స్..

కలెక్టర్ ప్రియాంక హైదరాబాద్ నగరంలోని ఉప్పల్‌లో పుట్టి పెరిగారు. హబ్సిగూడలోని జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో చదువుకున్నారు. ఇంటర్ తర్వాత మహారాష్ట్రలోని ఎంజీఎంఎస్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఆ తర్వాత సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. 2016 బ్యాచ్‌లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఆమె భర్త మణిపాల్‌కుమార్ గాంధీ ఆస్పత్రిలో సర్జన్‌గా పని చేస్తున్నారు. పిల్లలు మైరా (పాప), కియాన్ (బాబు) ఉన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి శనివారం రంగారెడ్డి జిల్లాకు చెందిన భక్తులు విరాళం అందజేశారు. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన కొండపల్లి భాస్కరమ్మ, సాయిజీరావు దంపతులు రూ.1.20 లక్షల చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యం

ఐటీడీఏ పీఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్‌జైన్

భద్రాచలం: గిరిజనుల సమగ్రాభివద్ధే లక్ష్యంగా కృషి చేస్తానని భద్రాచలం ఐటీడీఏ నూతన పీఓ ప్రతీక్ జైన్ వెల్లడించారు. ప్రస్తుత పీఓ గౌతమ్ పొట్రు సెర్ప్ సీఈఓగా బదిలీ కాగా, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్‌ను పీఓగా నియమించిన విషయం విదితమే. ఈ మేరకు శనివారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఏజెన్సీ ఏరియాలోని గిరిజన గ్రామాల్లో ఆదివాసీ, గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తూనే ప్రభుత్వ పథకాలు అందేలా పర్యవేక్షిస్తానని తెలిపారు. గిరిజనులకు సేవలందిస్తున్న అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సహకారంతో ముందుకు సాగుతానని చెప్పారు. అందరం బాధ్యతగా పనిచేస్తూ గిరిజనులకు సేవ చేయడంలో ముందుండాలని, ప్రధానంగా విద్యా, వైద్యరంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ప్రతీక్‌జైన్‌తో పాటు బదిలీ అయిన పీఓ గౌతమ్‌ను భద్రాచలం ఆర్డీఓ రత్నకళ్యాణి, అధికారులు, ఉద్యోగులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ(జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీ, ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, అధికారులు రమణయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ నుంచి భద్రాద్రి..

పీఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్ జైన్ ఢిల్లీలో జన్మించగా ఆయన విద్యాభ్యాసమంతా ఢిల్లీలోని దయానంద విహార్ పబ్లిక్ స్కూల్‌లో కొనసాగింది. ఆ తర్వాత గౌహతి ఐఐటీలో 2009 నుండి 2013 వరకు బీటెక్(ట్రిపుల్ ఈ) పూర్తిచేశారు. 2017 నుంచి 2019 వరకు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఎంఏ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) చేశారు. ఆ తర్వాత సివిల్స్‌కు హాజరుకాగా జాతీయ స్థాయిలో 88వ ర్యాంకు సాధించిన ఆయన 2017 బ్యాచ్ ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం మే 2018 నుంచి జూలై 2019 వరకు అసిస్టెంట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన ప్రతీక్.. జూలై 2019 నుంచి అక్టోబర్ 2019 వరకు జలశక్తి మినిస్ట్రీలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేశారు. ఆతర్వాత 9 ఫిబ్రవరి 2020 నుంచి రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రస్తుతం భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా నియమితులయ్యారు.



పీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రతీక్ జైన్, పక్కన గౌతమ్ పొట్రు

‘పెదవాగు’కు గేట్లు బిగించారు..

- నాలుగు అడుగులకు చేరిన నీటిమట్టం
- ఆయకట్టు రైతుల్లో హర్షాతిరేకాలు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్ద గల పెదవాగు ప్రాజెక్టు మూడు గేట్లు తుప్పు పట్టి నీరు భారీగా లీకై వృథాగా పోతోంది. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.1.23 కోట్లు కేటాయించగా, కొద్ది నెలలుగా మరమ్మతుల పనులు సాగుతున్నాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ ఏప్రిల్‌లో గేట్ల మరమ్మతుల పనులు ప్రారంభించింది. టెండర్ అగ్రిమెంట్ ప్రకారం జూన్ చివరి నాటికే పనులు పూర్తి చేయాల్సి ఉండగా, జూలై రెండో వారానికి రెండు గేట్ల మరమ్మతులు మాత్రమే పూర్తయ్యాయి. దీనిపై ఈ నెల 13న ‘పెదవాగు..పనుల్లో జాగు’ శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు స్పందించి మూడో గేటు పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో స్థానిక నీటి పారుదల శాఖ అధికారులు శనివారం నాటికి పనులు పూర్తి చేయించారు. ఇంకా గేట్ల పెయింటింగ్ చేపట్టాల్సి ఉండగా, ప్రస్తుతం వాతావరణం చల్లబడడంతో ఈ పనులను నిలిపివేశారు. ఇదిలా ఉండగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పెదవాగు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరింది. మూడు గేట్లను కిందికి దించడంతో ప్రాజెక్టు నీటి మట్టం 4 అడుగులకు చేరినట్లు ఏఈ కేఎస్‌బీ కృష్ణ తెలిపారు. ప్రాజెక్టులో వరదనీరు నిల్వ చేస్తుండటంతో సాగునీటికి ఇబ్బందులు తొలగినట్టేనని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కిందికి దించిన ప్రాజెక్టు గేట్లు

క్లుప్తంగా

నేడు స్వర నీరాజనం

భద్రాచలంటౌన్: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 77వ జయంతి సందర్భంగా ఆదివారం భద్రాద్రి స్వరాంజలి ఆధ్వర్యంలో స్వర నీరాజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి సుమారు 40 గాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. కళాకారులు, కళాభిమానులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అడవి నరికితే కఠిన చర్యలు



బైండోవర్ కేసు నమోదు చేస్తున్న తహసీల్దార్ భద్రకాళి

అన్నపురెడ్డిపల్లి: పోడు పేరుతో నూతనంగా అడవిలోని చెట్లను నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ భద్రకాళి హెచ్చరించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో పెంట్లం గ్రామానికి చెందిన పోడుదారుడైన చాప వీరస్వామిని ఎస్సై షాహీన తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఫారెస్ట్ ప్లాంటేషన్‌లో ఉన్న భూమిని అన్యాక్రాంతం చేయొద్దని, చెట్లను నరకొద్దని అన్నారు.

రైతులకు స్ప్రేయర్ల పంపిణీ



బ్యాటరీ స్ప్రేయర్లను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని మహదేవపురం రైతు వేదికలో శనివారం 20 మంది రైతులకు డబుల్ బ్యాటర్ స్ప్రేయర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామీణ వ్యవసాయ అభివృద్ధి సంఘం మేనేజింగ్ డైరెక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో రైతులకు అనేక రకాల వ్యవసాయ పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయశాఖ క్లస్టర్ ఏఈఓ ప్రవీణ్, వెంకటేష్, కావేరి, నాగరాజు, లక్ష్మి, నారాయణ, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

టేకులపల్లి: ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమణారెడ్డి శనివారం వివరాలు వెల్లడించారు. మండలంలోని బేతంపూడి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అజ్మీర వీరన్న గురువారం రాత్రి తన ఇంటికి తాళం వేసి గోలియాతండాలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. రాత్రి ఇక్కడే ఉండి, శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చాడు. అప్పటికే తలుపులు తీసి, బీరువా తెరిచి అందులోని బట్టలు, వస్తువులు చిందరవందరగా పడవేసి ఉన్నాయి. ఇంట్లో పరిశీలించగా 8 తులాల బంగారం, 60 తులాల వెండి, రూ.50 వేల నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యువతి అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: ఓ యువతి అదృశ్యంపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని గోపన్నగూడేనికి చెందిన ఓ ఇరవై ఏళ్ల యువతి ఈ నెల 14న ఉదయం నుంచి కనిపించడం లేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.రాజేశ్ కుమార్ తెలిపారు.

ఎండు గంజాయి పట్టివేత

భద్రాచలంటౌన్: ఖమ్మం జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి ఎండు గంజాయిని పట్టుకున్నారు. అధికారుల కథనం ప్రకారం.. పట్టణంలో తనిఖీలు చేస్తుండగా రెండు బైక్‌లపై వెళ్తున్న ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి బ్యాగులను తనిఖీ చేయగా 12.5 కేజీల ఎండు గంజాయి లభ్యమైంది. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నట్లు తేలింది. దీంతో రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.2.5 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో అధికారులు తిరుపతి, కరంచంద్, నాగేందర్‌రెడ్డి, సర్వేశ్వరరావు, నాగేశ్వరరావు, రహీమున్నిషా బేగం, లావణ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు టోకరా

ఆభరణాల మెరుగు పేరిట మోసం

కల్లూరు: బంగారు ఆభరణాలకు మెరుగుపెడతామని చెప్పిన ఇద్దరు వ్యక్తుల మాటలు నమ్మిన ఓ మహిళా కానిస్టేబుల్ మోసపోయింది. పోలీసుల కథనం ప్రకారం.. కల్లూరు శాంతినగర్‌కు చెందిన కె. రమాదేవి సైబరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఇటీవలే సెలవుపై ఆమె కల్లూరు రాగా, శుక్రవారం ఉదయం ఆమె ఇంటికి ఇద్దరు అపరిచిత వ్యక్తులు వచ్చారు. హిందీలో మాట్లాడిన వారు బంగారానికి మెరుగు పెడతామని చెప్పడంతో ఆమె తన 40 గ్రాముల గొలుసు ఇచ్చింది. ప్రత్యేక ద్రావణంలో గొలుసును మెరుగుపట్టినట్లుగా నమ్మించిన వారు వెళ్లిపోయారు. దీంతో అనుమానం వచ్చి తూకం వేయించగా 15 గ్రాములే ఉంది. దీంతో రమాదేవి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.రఘు తెలిపారు.

'హైర్' డ్రైవర్ల మెరుపు సమ్మె

- నిలిచిన కొత్తగూడెం డిపోలోని 32 అద్దె బస్సులు
- ఆర్టీసీకి సుమారు రూ.5 లక్షల మేర నష్టం
- సర్వీసుల సంఖ్య తగ్గడంతో ప్రయాణికులకు ఒకింత ఇబ్బంది



సమ్మెతో కొత్తగూడెం బస్టాండ్‌లో నిలిచిపోయిన అద్దె బస్సులు

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపో పరిధిలో అద్దె బస్సులను నడిపే డ్రైవర్లు శనివారం తెల్లవారుజాము నుంచి మెరుపు సమ్మెకు దిగారు. కనీస వేతనాలు తదితర సమస్యలు పరిష్కరించాలని ఆందోళనకు దిగారు. దీంతో కొత్తగూడెం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన అద్దె బస్సులు డిపోలోనే నిలిచిపోయాయి. తెల్లవారుజామున ఆర్టీసీ బస్టాండ్ గేటు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులకు మద్దతుగా ధర్నా నిర్వహించారు. కొత్తగూడెం డిపో పరిధిలో మొత్తం 82 బస్సులు ఉండగా, వాటిలో 32 అద్దె బస్సులు ఉన్నాయి. హైర్ సర్వీసులలో 20 పల్లె వెలుగు, 12 ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. ఇవి హైదరాబాద్, ఖమ్మం, సత్తుపల్లి, మణుగూరు, ఇల్లెందు, కోదాడ, విజయవాడ, మిర్యాలగూడ తదితర రూట్లకు తిరుగుతుంటాయి. అద్దె బస్సుల్లో 75 మంది డ్రైవర్లు, 10 మంది హెల్పర్లు పనిచేస్తున్నారు. డ్రైవర్‌కు ప్రస్తుతం దూరాన్ని బట్టి రూ. 650 నుంచి రూ.750 వరకు చెల్లిస్తున్నారు. అయితే రోజుకు లోకల్ సర్వీసులకు రూ.1,000, హైదరాబాద్, విజయవాడ, కోదాడ, మిర్యాలగూడ వంటి రూట్లకు వెళ్తే రూ.1,500 చొప్పున చెల్లించాలని డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. హెల్పర్లకు రోజుకు రూ.100 చొప్పున చెల్లిస్తున్నారని, ఇక నుంచి కనీసం రూ.150 నుంచి రూ.200 వరకు చెల్లించాలని కోరుతున్నారు. వేతనాలు పెంచాలని ఆర్టీసీ డిపో మేనేజర్, లేబర్ ఆఫీసర్, అద్దె బస్సుల యజమానులకు మూడు నెలలుగా విన్నవించినా పట్టించుకోలేదని, అందుకే సమ్మె బాట పట్టామని పేర్కొంటున్నారు. సమ్మె కారణంగా శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి బస్సులు బస్టాండ్‌లో నిలిచిపోయాయి. ఇల్లెందు, ఖమ్మం, సత్తుపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సంఖ్య తగ్గడంతో ప్రయాణికుల కొంతమేర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మరోవైపు డ్రైవర్లు, హెల్పర్లతో అధికారులు, యజమానులు చర్చలు జరిపినా సఫలం కాలేదు. అద్దె బస్సులు నిలిచిపోవడంతో డిపోకు రూ.5 లక్షల వరకు నష్టం జరిగే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఇవీ డిమాండ్లు

కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలి. రెండు జతల యూనిఫామ్, ఆర్టీసీలో మాదిరిగా బస్ పాస్‌లు ఇవ్వాలి. ప్రతీ నెల 5న బ్యాంక్ అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలి. బోనస్ సౌకర్యం కల్పించాలి.

వెనక్కి తగ్గం



సమస్యలను పరిష్కరించాలని యజమానులకు విన్నవించాం. సమ్మె నోటీసులు ఇచ్చి 15 రోజులు గడిచినా స్పందించలేదు. దీంతో తప్పక సమ్మెబాట పట్టాల్సి వచ్చింది. కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చే వరకు వెనక్కి తగ్గేది లేదు. –కత్తి నర్సింహారావు, అద్దె బస్సుల డ్రైవర్ల సంఘం కార్యదర్శి

పరిష్కరించాలని సూచించాం



అద్దె బస్సుల డ్రైవర్లు శనివారు తెల్లవారుజాము నుంచి సమ్మెకు దిగారు. సమస్య యజమానుల పరిధిలో ఉండటంతో వారిని పిలిపించి మాట్లాడాం. కార్మికులతో చర్చించి సమస్యను త్వరితంగా తేల్చాలని సూచించాం. సమ్మెతో డిపోకు ఆదాయం తగ్గే అవకాశం ఉంది. –బాణాల వెంకటేశ్వరరావు, డిపో మేనేజర్

వరదలతో ప్రాణహాని కలగొద్దు

భద్రాచలం ఆర్డీఓ రత్నకల్యాణి



సమావేశంలో పాల్గొన్న ఆర్డీఓ, ఇతర అధికారులు

భద్రాచలం: గోదావరి వరదలతో ఎవరికీ ప్రాణహాని జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తీవ్రతను బట్టి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని భద్రాచలం ఆర్డీఓ రత్నకల్యాణి ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గోదావరి వరదల ముందస్తు చర్యలపై డివిజన్ స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గోదావరి వరదలతో గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క అధికారిపై ఉందన్నారు. వరదల్లో చిక్కుకున్న వ్యక్తులను రక్షించేందుకు లైఫ్ జాకెట్లు, నాటు పడవలు, బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. నిత్యావసర వస్తువులు నిలువ చేసుకోవాలని చెప్పారు. వరద ముంపు చర్యల పర్యవేక్షణకు సెక్టోరియల్, జోనల్ అధికారలను నియమించామని తెలిపారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఆయా గ్రామాల ప్రజల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలని, వరద 70 అడుగులు వస్తే విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. విస్తా కాంప్లెక్స్ వద్ద అదనపు మోటర్లను, ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో గర్భిణులను గుర్తించి ముందస్తుగా ఆస్పత్రులకు తరలించాలని, అన్ని ఆస్పత్రుల్లో అత్యవసర మందులు, అంబులెన్స్, ఆర్‌బీఎస్‌కే వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని వివరించారు. తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంతోపాటు జిల్లా, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గోదావరి వరదలు వచ్చి తగ్గిపోయే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, సెక్టోరియల్ అధికారులు, ఏడీ ఎలక్ట్రికల్ జీవన్‌కుమార్, భద్రాచలం తహసీల్దార్ రామకృష్ణ, సీఐ నాగరాజురెడ్డి, ఈఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముదురుతున్న పోరు

- ఇల్లెందు మున్సిపాలిటీలో షోకాజ్ రగడ
- కలెక్టరేట్‌లో సంజాయిషీ అందించిన వైస్ చైర్మన్

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ పోరులో షోకాజ్ రగడ ఊపందుకుంది. తాజాగా వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషాకు అందిన నోటీస్‌కు శనివారం ఆయన కలెక్టరేట్‌లో సంజాయిషీ అందజేశారు. అంతేకాక జానీపాషాకు మద్దతుగా నిలిచిన 15 మంది కౌన్సిలర్లు చైర్మన్ డి.వెంకటేశ్వర్లు, కమిషనర్ అంకుషావలికి వ్యతిరేకంగా పిర్యాదు చేశారు. షోకాజ్ నోటీస్‌లో పేర్కొన్నవన్నీ అవాస్తవాలేనని వివరించారు. గతేడాది కాలంగా జరుగుతున్న వర్గ పోరులో చైర్మన్.. కమిషనర్‌ను పావుగా వాడుకుని నోటీస్ డ్రామాకు తెరలేపారని పేర్కొన్నారు. చైర్మన్‌పై అందజేసిన అవిశ్వాస తీర్మాన అంశం కోర్టులో పెండింగ్‌లో ఉందని, గతంలో 23 అంశాలపై చేసిన పిర్యాదు మీద చేపట్టిన విచారణ వివరాలు వెల్లడించలేదని, నిష్పక్షపాతంగా విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు అంటున్నారు.

చైర్మన్‌కు కమిషనర్ వత్తాసు అంటూ ఆరోపణ..

మున్సిపల్ చైర్మన్ డీవీపై 15 మంది కౌన్సిలర్లు అవిశ్వాస నోటీస్ అందజేశారు. చైర్మన్ వెంట తక్కువ మంది కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారని, ఎక్కువ మందిమి ఆయనకు వ్యతిరేకంగా పోరాడుతున్నామని, అయితే కమిషనర్ ఇరువర్గాలను సమానంగా చూడకుండా చైర్మన్‌కు వత్తాసు పలుకుతున్నారని జానీపాషా మద్దతుదారులైన కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వార్డు సమస్యలపై తాము చర్చిస్తే దానిని బెదిరించినట్లు, విధులకు అడ్డుతగులుతున్నట్లు ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం సరికాదని అంటున్నారు. ఇలాంటి అంశాలపై విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, ఈ మేరకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

పట్టింపు లేనట్లుగా ఎమ్మెల్యే..

నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ఏకైక మున్సిపాల్టీలో చైర్మన్, వైస్ చైర్మన్ మధ్య వైరం మరోమారు రచ్చకెక్కే పరిస్థితి నెలకొంది. అధికార పార్టీకి చెందిన వైస్ చైర్మన్‌పై కమిషనర్ పిర్యాదు చేయడం, దాని ఆధారంగా షోకాజ్ నోటీస్ జారీ కావడం అంటే పాలనలో లోపాలు వెలుగులోకి వచ్చినట్లేనని పలువురు అంటున్నారు. అధికార పార్టీలో అనైక్యతకు ఇదే నిదర్శనమని, ఎమ్మెల్యే హరిప్రియకు సమాచారం లేకుండా షోకాజ్ నోటీస్ జారీ కావడం, ఆ తర్వాత కూడా ఆమె పట్టించుకోకపోవడం ఏంటనే సందేహాలు తలెత్తుతున్నాయి.

ప్రశ్నించే గొంతుకలను అణచివేశారు..

- ఏకపక్షంగా ఐటీసీ ప్రజాభిప్రాయ సేకరణ
- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శంకర్‌నాయక్

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీ 8వ యూనిట్ విస్తరణకు శుక్రవారం నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ముందస్తు వ్యూహంతో ఏకపక్షంగా నిర్వహించారని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ శంకర్‌నాయక్ ఆరోపించారు. శనివారం బూర్గంపాడులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ పహారాతో ప్రశ్నించే గొంతుకలను అణచివేసి, అనుకూల వర్గాల వారితో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారని తెలిపారు. ప్రజాభిప్రాయ వేదిక నిర్వహిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్‌కు మాట్లాడేందుకు అనుమతించాలని పేర్లు ఇచ్చిన తమ గొంతు వినిపించకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ఏకపక్షంగా ఐటీసీ భజన బృందంతో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేసి మళ్లీ పారదర్శకంగా పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో వేలకోట్ల లాభాలార్జిస్తున్న ఐటీసీ పీఎస్‌పీడీని జాతీయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఐటీసీ పీఎస్‌పీడీని కొనుగోలు చేసి నిర్వహణ బాధ్యతలను సింగరేణికి అప్పగించాలన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ కొనేందుకు అత్యుత్సాహం చూపుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దానికి బదులుగా ఐటీసీ పీఎస్‌పీడీని కొనుగోలు చేసి ఏజెన్సీలో గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. పబ్లిక్ హియరింగ్‌లో బీఆర్ఎస్ నాయకులు ఐటీసీ తొత్తులుగా మాట్లాడారన్నారు. తెలంగాణ ప్రభుత్వ పెద్దలు తమ కమీషన్ల కోసమే ఐటీసీ పీఎస్‌పీడీ విస్తరణకు అనుమతులిస్తోందని తెలిపారు. ఐటీసీ విస్తరణపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామన్నారు. ఈ సమావేశంలో మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గురిజాల గోపి, కాంగ్రెస్ నాయకులు పులిపాటి పాపారావు, బూరుగుల కిరణ్‌మోహన్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం సీజ్



ఎరువుల దుకాణాన్ని సీజ్ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గుండాల: ఎరువులు, పురుగుల మందులకు సంబంధించి సరైన డాక్యుమెంట్లు లేకపోవడంతో మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న బీవీఎస్ ట్రేడర్స్ షాపును సీజ్ చేసినట్లు ఏఓ అశోక్ తెలిపారు. ఏఈఓ లెనిన్‌తో కలిసి ఆయన శనివారం ఎరువులు, పురుగుల మందుల షాపులను తనిఖీ చేశారు. దుకాణాలకు లైసెన్సులు ఉండాలని, స్టాక్ రిజిస్టర్లు, రైతులకు విక్రయించినట్లు బిల్లులు కచ్చితంగా ఉండాలని, లేకపోతే దుకాణాల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని చర్ల రోడ్డులో శనివారం రెండు బైక్‌లు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆ ప్రదేశంలో రోడ్డు క్రాసింగ్ ఉండటం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. కాగా, క్షతగాత్రుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నర్సరీ కేంద్రాల తనిఖీ



నర్సరీలో తనిఖీ చేస్తున్న మరియన్న

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని ఇల్లెందు, టేకులపల్లి, పాల్వంచ, సుజాతనగర్ మండలాల్లో మిరప, కూరగాయల నర్సరీలను జిల్లా ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సరీదారులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. రైతులు అంగీకారం తెలిపిన, వ్యవసాయ శాఖ ద్వారా ఆమోదం పొందిన రకాల నారును మాత్రమే పెంచాలని సూచించారు. నర్సరీ చట్టం ప్రకారం నిబంధనలు పాటించాలన్నారు. ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానా కూడా విధిస్తామని హెచ్చరించారు.

మధ్యాహ్నమే పాఠశాలకు తాళం

సెలవు వస్తే ఆ ముందు రోజు ఒక్క పూటే బడి



పగలే తాళం వేసి ఉన్న పాఠశాల

అశ్వారావుపేటరూరల్: ఐటీడీఏ, విద్యాశాఖ అధికా రుల పర్యవేక్షణ లేకపోవడంతో ఓ ఉపాధ్యాయుడు నిబంధనలకు విరుద్ధంగా ఒంటి పూటే బడి నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని పాలకగూడెం గ్రామంలో ఉన్న గిరిజన ప్రాథమి కోన్నత పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులు కొనసాగిస్తున్నారు. 29మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఒకే ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తిస్తుండగా, సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా శనివారం సదరు ఉపాధ్యాయుడు మధ్యాహ్నమే పాఠశాలకు తాళంవేసి వెళ్లిపోయాడని స్థానికులు తెలిపారు. సెలవు వస్తే ముందు రోజు పాఠశాలను ఒక పూట మాత్రమే నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. సదరు ఉపాధ్యాయుడు స్థానికంగా ఉండకుండా, మహబూబాబాద్ జిల్లా నుంచి రాకపోకలు సాగిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఎంఈఓ కృష్ణయ్యను 'సాక్షి' వివరణ కోరగా.. ఈ విషయం తనదృష్టికి రాలేదని, విచా రించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రెవెన్యూ అధికారులపై సీఎంఓకు ఫిర్యాదు

పాల్వంచరూరల్: ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం చేస్తుండటంతో రెవెన్యూ అధికారులపై సీఎంఓకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పిల్లి శ్రీను తెలిపారు. శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని సంగం గ్రామానికి చెందిన పిల్లి శ్రీను తన ఇద్దరు కుమార్తెల ఉన్నత చదువుల కోసం ఈ నెల 7న మీ సేవ ద్వారా ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేశానని తెలిపాడు. వారం రోజులు గడిచినా సర్టిఫికెట్లు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించాడు. ఆర్ఐ, డీటీ పట్టించుకోకపోవడంతో సమస్యను తహసీల్దార్ రంగాప్రసాద్ దృష్టికి తీసుకెళ్లానని, తహసీల్దార్ ఆదేశించినా సర్టిఫికెట్లు ఇవ్వట్లేదని వాపోయాడు. ప్రశ్నిస్తే గొడవ చేస్తున్నావంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని డీటీ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. గత్యంతరం లేక ఆర్ఐకు డబ్బులు ఇచ్చినా ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో సీఎంఓకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. కాగా ఆర్ఐ హచ్యాను వివరణ కోరగా.. తాను డబ్బులు తీసుకున్నానని చెప్పడం వాస్తవం కాదని తెలిపారు. విచారణలో స్థానికంగా ఉండటం లేదని తేలడంతో ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదని పేర్కొన్నారు.

సీపీఐ నాయకులపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: ఓ ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నించిన 11 మంది సీపీఐ నాయకులపై శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని కెమిలాయిడ్స్ గెస్ట్ హౌస్‌కు వెళ్లే మార్గంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో రెండు రోజుల క్రితం అక్రమంగా పేదలతో ఆక్రమించి, గుడిసెలు వేయించేందుకు యత్నించారు. దీంతో ఆర్ఐ కృష్ణ ఫిర్యాదు మేరకు సీపీఐ నాయకులు ఎస్‌డీ సలీం, ఎస్‌డీ రఫీ, గన్నిన రామకృష్ణ, చీపుర్ల సత్యవతితోపాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీఓకు తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీఓ కారు

జూలూరుపాడు: ఆర్టీఓ వేణుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆర్టీఓ వేణు శనివారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి కారులో కొత్తగూడెం వస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని మాచినేనిపేటతండా గ్రామం వద్ద ఆర్టీఓ వాహనాన్ని కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళుతున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగంలో దెబ్బతినగా, ఎవరికీ గాయాలు కాలేదు. జూలూరుపాడు ఎస్ఐ పోటు గణేష్ సంఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు.

యువతి ఆత్మహత్య



పావని (ఫైల్)

టేకులపల్లి: పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక ఓ యువతి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఎస్ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం రాంపురం పంచాయతీ పాతతండాకు చెందిన భూక్య పావని(24) తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులు చేస్తోంది. తండ్రి లంబి నాయక్ కొంతకాలంగా ఆమెకు పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు. పెళ్లి చేసుకోవడం తనకు ఇష్టం లేదని పలుమార్లు చెప్పగా, తండ్రి నచ్చచెబుతున్నాడు. మళ్లీ సంబంధాలు చూస్తుండటంతో మనస్తాపం చెంది ఈ నెల 13న ఇంట్లోనే పురుగుల మందు తాగింది. దీంతో కుటుంబీకులు కొత్తగూడెం, అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి శనివారం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ఉరివేసుకుని...

పాల్వంచ: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ పరిధిలోని వెంగళరావు కాలనీకి చెందిన గుమ్మడి రాజు కిషన్(50) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం కూడా గొడవ జరగడంతో భార్య రమ పక్కింటికి వెళ్లి ఉంటోంది. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

క్లుప్తంగా...

మరో 23మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ఆదేశాల నేపథ్యంలో వరుసగా రెండో రోజూ పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేశారు. 23 మందిని బదిలీ చేసి అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలుగా పోస్టింగులివ్వగా, మరో 9 మందిని ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ శనివారం ఆదేశాలు జారీ చేశారు.

43 మంది డీఎస్పీలకు స్థానచలనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 43 మంది డీఎస్పీల(సివిల్)ను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం డీజీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

22 మంది మునిసిపల్ కమిషనర్ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ పురపాలక సంస్థల్లో పనిచేస్తున్న 22 మంది మునిసిపల్ కమిషనర్లను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ కార్యదర్శి సి.సుదర్శన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి పాత పింఛన్ సాధన రథయాత్ర: స్థితప్రజ్ఞ

సాక్షి, హైదరాబాద్: కంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేసి రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో ఆదివారం నుంచి పాత పింఛన్ సాధన సంకల్ప రథయాత్ర నిర్వహించనున్నట్టు తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈ యాత్ర సాగుతుందని, ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ క్షేత్రం నుంచి ప్రారంభమై ఈనెల 31న యాదాద్రి నరసింహుని సన్నిధిలో ముగుస్తుందని శనివారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సామాజిక భద్రతను కల్పించే పాత పింఛన్ ఆవశ్యకతను తెలియజెప్పడంతో పాటు పాత పింఛన్ అమలు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ యాత్ర చేపడుతున్నామని తెలిపారు. తమ డిమాండ్‌కు ఇప్పటికే టీజీవో, టీఎన్జీవో సహా పలు సంఘాలు మద్దతిచ్చాయని, పాత పింఛన్ పొందుతున్న ఉద్యోగులు కూడా ఈ యాత్రకు మద్దతివ్వాలని కోరారు. కంట్రిబ్యూటరీ పింఛన్ విధానం రద్దుతో రాష్ట్రంలోని 1.72 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు సామాజిక భద్రత చేకూరుతుందన్నారు.

బాత్రూమ్‌లో బీ కేర్‌ఫుల్

ఇళ్లలో రెండో అత్యంత ప్రమాదకర ప్రదేశం

- అనేక మంది ప్రముఖులు బాత్రూమ్ ప్రమాదాల్లోనే మృతి
- ప్రమాదాల బారిన పడుతున్న వారిలో 60 ఏళ్లు దాటిన వారే ఎక్కువ



సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా ఏటా 15 ఏళ్లు పైబడిన వారిలో 2.35 లక్షల మంది బాత్రూమ్‌లో గాయపడుతున్నారని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ నివేదిక చెబుతోంది. ఇంట్లో అతి చిన్న గదే అయినప్పటికీ.. వంటగది తరువాత బాత్రూమ్ అత్యంత ప్రమాదకరమైన ప్రదేశం. బాత్రూమ్‌లో సంభవించే ప్రమాదాల కారణంగా ఒక్క యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలోనే నిత్యం 347 మంది మరణిస్తున్నారు. మన దేశంలో ఎముకల చికిత్స కోసం వెళుతున్న వారిలో దాదాపు 35నుంచి 45 శాతం మంది బాత్రూమ్‌లో జారిపడి గాయాల పాలైనవారే. ప్రముఖ సినీ నటి శ్రీదేవి దగ్గర్నుంచి తాజాగా చైతన్య విద్యాసంస్థల అధినేత బీఎస్ రావు వరకూ అనేక మంది ప్రముఖుల మరణాలు బాత్రూమ్‌లోనే సంభవించాయి.

ఈ జాగ్రత్తలు పాటించాలి

వదులుగా ఉన్న టాయిలెట్ బౌల్ రిమ్‌పై కూర్చోవడం వల్ల అది అటూ ఇటూ కదిలి శరీరానికి గాయం చేయవచ్చు. ప్లాస్టిక్ సీట్లు పగిలిపోవడం, వ్యక్తి బరువు వల్ల కూలిపోవడం కూడా గాయాలు కలిగించవచ్చు. టాయిలెట్లలో సిగరెట్లు వంటివి పడేయడం వల్ల అవి పేలిపోయే ప్రమాదం కూడా ఉంది. కోసుకుపోవటం, ఎముకలు విరగటం, వెన్నెముకకి గాయాలు, ఫ్రాక్చర్లు, వంటివి మామూలే. సాధారణంగా బాత్రూమ్ ప్రమాదాలు మనం టబ్‌లోంచి బయటకు వస్తున్నప్పుడో, టాయిలెట్ సీటుపై కూర్చున్నప్పుడో, తువ్వాలు తీసుకుంటున్నప్పుడో లేదా జారుడు నేలపై నడిచినప్పుడో జరుగుతాయి. ఇలాంటివి ఆపాలంటే బాత్రూమ్ వాడుతున్నప్పుడు లైట్లు, డోర్ మ్యాట్లు వేయాలి. బాత్రూమ్ నేలను పొడిగా ఉండేలా చూసుకోవడంతో పాటు, పట్టుకోదానికి హ్యాండిల్స్ పెట్టించాలి. పాశ్చాత్య టాయిలెట్‌లో కూర్చుని లేచే సమయంలో హేండిల్ పట్టుకుని లేవాలి. బాత్రూమ్‌కి వెళ్లినప్పుడు లోపల గట్టిగా గడియపెట్టుకోవకపోవడం వృద్ధులకు మంచిది. షవర్ కింద స్నానం చేసే సమయంలో స్టూల్ వాడాలి. చల్లని నీటితో స్నానం చేసినప్పుడు ముందుగా తలపై కాకుండా పాదాలపై నీటిని పోసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

చరిత్రలో కొన్ని దుర్ఘటనలు

- చైనాలోని జిన్ రాష్ట్ర పాలకుడు క్రీస్తు పూర్వం 581లో టాయిలెట్ పిట్‌లో పడి మరణించాడు.
- చరిత్రలో మర్చిపోలేని దుర్ఘటన ఒకటి 1184న జూలై 26న సంభవించింది. 'ఎర్ఫర్ట్ లెట్రిన్ విపత్తు'గా పిలిచే ఈ ప్రమాదం రోమన్ చక్రవర్తి హెన్రీ అనధికార సమావేశం నిర్వహిస్తుండగా.. దానికి హాజరైన వారి బరువు కారణంగా చెక్క భవనం రెండవ అంతస్తు నేల కూలిపోయింది. కొంతమంది గ్రౌండ్ ఫ్లోర్ కింద ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో పడి మునిగిపోవడంతో 60 మంది మరణించారు.
- 1760లో గ్రేట్ బ్రిటన్‌కు చెందిన కింగ్ జార్జ్ అక్టోబర్ 25న టాయిలెట్‌లో మరణించాడు.
- 1945లో జర్మన్ జలాంతర్గామి ఒక టాయిలెట్ ప్రమాదంలో మునిగిపోయింది.
- 1983 జూన్ 2న ఎయిర్ కెనడా విమానం -797 వెనుక లావెటరీలో మంటలు చెలరేగి విమానం మొత్తం కాలిపోయింది. ప్రమాదంలో 23 మంది మరణించారు.
- బ్రిటిష్ వ్యాపారవేత్త, కన్జర్వేటివ్ పార్టీ నాయకుడు క్రిస్టోఫర్ షేల్ జూన్ 26, 2011న గ్లాస్టన్‌బరీ ఫెస్టివల్‌లో పోర్టబుల్ టాయిలెట్‌లో గుండెపోటుతో చనిపోయాడు.
- టాయ్‌లెట్ల ఫిట్టింగ్‌లు సరిగ్గా లేకపోవడం వల్ల ఏటా దాదాపు 10 వేల ఓడలు ప్రపంచవ్యాప్తంగా మునిగిపోతున్నాయి.

అప్రమత్తంగా ఉండండి



'బాత్రూమ్' మరణాల్లో ఎక్కువ శాతం హార్ట్ అటాక్ వల్లే సంభవిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం చల్లని నీటితో తలస్నానం చేసినప్పుడు.. ఆ నీటిని తలపై పోసుకుంటే శరీరంలో ఆ భాగం చల్లగా మారుతుంది. దీంతో రక్తనాళాలు వెంటనే అలర్ట్ అయ్యి రక్తాన్ని ఒక్కసారిగా పైకి పంపిస్తాయి. దీనివల్ల తల భాగం వైపు రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడుతుంది. ఫలితంగా ఒక్కసారిగా బ్లడ్ ప్రెషర్ పెరిగి హార్ట్ అటాక్ వస్తుంది. కొన్నిసార్లు పక్షవాతం కూడా రావచ్చు. జారి పడిపోయినప్పుడు తల నరాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. వెన్నుపూస కూడా విరగవచ్చు. కాబట్టి అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ సుధాకర్ కనపర్తి, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు, విజయవాడ

వృద్ధుల ప్రాణాలు తీస్తున్నాయ్



ఇంట్లో 65 ఏళ్లు పైబడిన పెద్దవారు ఉంటే.. బాత్రూమ్ ప్రమాదాల గురించి కచ్చితంగా తెలుసుకోవాలి. ప్రతి నలుగురిలో ముగ్గురు వృద్ధులు ఏడాదికి ఒకసారైనా బాత్రూమ్‌లో జారిపడే అవకాశం ఉంది. ఈ ప్రమాదాల్లో 65 శాతం చిన్న గాయాలతో సరిపెట్టినా.. మిగతా 35 శాతం మాత్రం ప్రాణాలు తీస్తున్నాయి. మన దేశంలో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం.. దేశంలో 42 శాతం మంది టాయిలెట్లలో 7 నుంచి 10 సార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. 58 శాతం మంది 11 నుంచి 15 సార్లు పడిపోతున్నారు. సరైన తలుపులు లేకపోవడం ప్రమాదానికి వంద శాతం కారణమవుతుండగా, జారే ఫ్లోర్ 91.9 శాతం, బాత్రూమ్ పరిమాణం 80.3 శాతం, ఎత్తైన తలుపు థ్రెషోల్డ్ 53.5 శాతం, నాన్-స్కిడ్ మ్యాట్ లేకపోవడం 99.5 శాతం, గ్రాబ్ బార్‌లు లేకపోవడం 97 శాతం, ఎగ్జాస్ట్ ఫ్యాన్ లేకపోవడం 96.6 శాతం, బాత్రూమ్‌లో వెలుతురు సరిపోకపోవడం వల్ల 94.4 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయి. వేడి నీటి వినియోగం 89.9 శాతం, సీట్ ఉపరితలం 55.6 శాతం, ప్రవేశ ద్వారం వద్ద లైట్ స్విచ్ లేకపోవడం 53 శాతం, చిందరవందరగా ఉన్న మార్గం వంటివి 39.4 శాతంకారణమవుతున్నాయి. ఎన్‌సీబీఐ మార్కెటింగ్ ఏజెన్సీ నివేదిక ప్రకారం.. 11 శాతం హార్ట్ అటాక్‌లు బాత్రూమ్‌లోనే వస్తున్నాయి. మలవిసర్జనకు వెళ్లినప్పుడు లేదా స్నానం చేస్తున్న సమయంలో ఇవి సంభవిస్తున్నాయి.

ఆస్ట్రేలియాకు మేడిన్ ఏపీ ఈ-స్కూటర్లు

- కాన్‌బెర్రాకు ఎగుమతి చేయనున్న అవెరా సంస్థ
- పైలట్ ప్రాజెక్టు కింద తొలుత 100 ఈ-స్కూటర్ల ఎగుమతి



సాక్షి, అమరావతి: ఆస్ట్రేలియా రోడ్లపై మేడిన్ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిక్ స్కూటర్లు దూసుకుపోనున్నాయి. ఎన్టీఆర్ జిల్లా నున్న సమీపంలోని విద్యుత్ వాహనాల తయారీ సంస్థ 'అవేరా'తమ వ్యాపార విస్తరణలో భాగంగా ఆస్ట్రేలియాలో అడుగుపెడుతోంది. కాన్‌బెర్రా రాష్ట్రానికి పైలట్ ప్రాజెక్టు కింద 100 ఎలక్ట్రిక్ స్కూటర్లను అవేరా సంస్థ ఎగుమతి చేయబోతోంది. ఈ విషయాన్ని అవేరా వ్యవస్థాపక సీఈవో డాక్టర్ వెంకటరమణ 'సాక్షి'కి తెలిపారు. ఇటీవల ప్రధాని మోదీ ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా.. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై చర్చలు జరిగాయని చెప్పారు. ఆస్ట్రేలియాకు ఎగుమతి చేసే ఎలక్ట్రిక్ స్కూటర్లపై సుంకాలు, పన్నులు విధించకుండా భారత్ ప్రభుత్వం త్వరలో ఒప్పందం కుదుర్చుకుంటుందన్నారు. ఆస్ట్రేలియాలో ఈ-స్కూటర్లను ప్రోత్సహించడానికి కాన్‌బెర్రా సీఎం ఆండ్రూ ముందుకు వచ్చారని తెలిపారు. తొలుత విశ్వవిద్యాలయ విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం అవేరాకు చెందిన 100 విన్సిరో ఈ-స్కూటర్లను సరఫరా చేయాలని ఆయన కోరినట్లు వివరించారు. కాన్‌బెర్రా సీఎం ఆండ్రూ భారత్ పర్యటనలో భాగంగా వచ్చే ఏడాది ఏపీకి వస్తారని, ఆ సమయంలో దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకుంటామని చెప్పారు.

బోరుబావి నుంచి అగ్నికీలలు

మధ్యాహ్నానికి ఆగిపోయిన గ్యాస్.. మంటలు

రాజోలు: ఆక్వా చెరువుకు నీటి కోసం ఏర్పాటు చేసుకున్న 280 అడుగుల లోతు బోరుబావి నుంచి గ్యాస్ భూ ఉపరితలం పైకి వచ్చి అగ్నికీలలు ఎగసిపడ్డాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోటి గ్రామంలోని మట్టపర్రు రోడ్డులో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. మట్టపర్రు రోడ్డులో ఆక్వా చెరువులకు నీటి కోసం రైతులు నాలుగేళ్ల కిందట బోరుబావి తవ్వారు. శ్రీనివాస్ అనే రైతు ఈ బోరుబావి నుంచి తన చెరువులోకి నీటిని తోడుతున్నాడు. బోరుబావి నుంచి శనివారం తెల్లవారుజామున ఒక్కసారిగా గ్యాస్ పైకి రావడంతోపాటు మంటలు ఉధృతంగా ఎగసిపడ్డాయి. ఆక్వా రైతులు ఓఎన్జీసీ, రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఓఎన్జీసీ, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని బోరు బావి నుంచి గ్యాస్ వస్తుందని, బావి అడుగున ఉన్న విద్యుత్ మోటారులో సాంకేతిక లోపంతో నిప్పురవ్వలు చెలరేగి మంటలు ఎగసిపడుతున్నాయని నిర్ధారించారు.



బోరుబావి నుంచి ఎగసిపడుతున్న అగ్నికీలలు

మధ్యాహ్నానికి గ్యాస్ పైకి రావడం ఆగిపోయింది. దీంతో మంటలు కూడా ఆగిపోయాయి. అనంతరం వెంటనే ఓఎన్జీసీ, రాజోలు అగ్నిమాపక సిబ్బంది కలసి ఇసుక, నీటితో బోరుబావిని పూర్తిగా పూడ్చివేశారు. ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలకు చెందిన పైప్‌లైన్లు ఆ ప్రాంతంలో లేవని, అయినప్పటికీ ఈ బోరుబావి నుంచి గ్యాస్ ఎలా వచ్చిందనే విషయాన్ని పరిశీలిస్తామని ఓఎన్జీసీ అధికారులు తెలిపారు.

'చైతన్య' బీఎస్ రావుకు కన్నీటి వీడ్కోలు

పెనమలూరు: శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావుకు శనివారం కన్నీటి వీడ్కోలు పలికారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం తాడిగడప శ్రీచైతన్య క్యాంపస్ నుంచి ప్రత్యేక వాహనంలో ఆయన భౌతికకాయాన్ని బందరు రోడ్డు మీదుగా గోసాల క్యాంపస్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అంతిమ మజిలీలో కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు, శ్రీచైతన్య విద్యాసంస్థల సిబ్బంది, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీఎస్ రావుకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గోసాల వ్యవసాయ క్షేత్రంలో బీఎస్‌రావు భౌతిక కాయానికి అంత్యక్రియలు పూర్తి చేశారు.



బీఎస్ రావు అంతిమయాత్ర దృశ్యం

జిల్లా వార్తలు


పొంగులేటి నియామకంపై సంబురాలు



కేక్ కట్ చేస్తున్న దయాకర్‌రెడ్డి, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ప్రచార కమిటీ కోచైర్మన్‌గా నియమించడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో శనివారం వివిధ ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాణసంచా కాల్చారు. అనంతరం క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి కేక్ కట్ చేసి మాట్లాడారు.

23 వరకు ప్యాసింజర్ రైళ్ల రద్దు పొడిగింపు



ఖమ్మంమామిళ్లగూడెం: ట్రాక్ మరమ్మతుల కారణంగా పలు ప్యాసింజర్ రైళ్లను రద్దుచేసిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు మరికొంత కాలం ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని వెల్లడించారు. ఈ నెల 16వ తేదీ వరకు ప్యాసింజర్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు గతంలో ప్రకటించగా, 23వ తేదీ వరకు పొడిగించినట్లు సీసీఐ జాఫర్ తెలిపారు. విజయవాడ నుంచి ఖమ్మం మీదుగా వెళ్లే డోర్నకల్ - విజయవాడ(07755), విజయవాడ - డోర్నకల్(07756), భద్రాచలంరోడ్ - విజయవాడ(07278), విజయవాడ - భద్రాచలం రోడ్(07279) ప్యాసింజర్ రైళ్లు ఈ నెల 23 వరకు రద్దు చేసిన విషయాన్ని ప్రయాణికులు గమనించాలని ఆయన కోరారు.

రేపటి నుంచి గాంధీపురం రైల్వేగేట్ మూసివేత

కారేపల్లి: రోడ్డు మరమ్మతుల దృష్ట్యా కారేపల్లి మండలంలోని గాంధీపురం రైల్వే గేట్(ఎల్‌సీ 5కేకే)ను ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు. ఖమ్మం - ఇల్లెందు ప్రధాన రహదారిపై గాంధీపురం రైల్వే గేట్ వద్ద రోడ్డు మరమ్మతులు జరుగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇల్లెందు నుంచి ఖమ్మం వైపు, ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వెళ్లే వాహనాలను కారేపల్లి రైల్వే గేట్ మీదుగా మళ్లిస్తున్న విషయాన్ని వాహనదారులు గమనించాలని కోరారు.

'ఉన్నత'మైన ఆలోచన

- చదువు మధ్యలో మానేసిన వారికి వరంలా 'ఓపెన్'
- ఉద్యోగాలు, పదోన్నతులకు ఉపయోగం
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 55 అధ్యయన కేంద్రాలు
- పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు వచ్చేనెల 10 వరకు అవకాశం



అభ్యసన కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు

ఖమ్మంసహకారనగర్: గతంలో ఓ వయస్సు దాటాక చదువుపై పెద్దగా ఆసక్తి చూపించకపోయేవారు. అలాగే, చిన్నపాటి ఉద్యోగం వస్తే అంతకు మించి పదోన్నతులు అవసరం లేదనే భావన ఉండేది. కానీ, ఇప్పుడు చదువులో ఉన్నత స్థాయికి చేరాలని.. ఉద్యోగంలో పదోన్నతి పొందాలనే తపన పెరిగింది. ఇవన్నీ కాకుండా కనీస విద్యార్హత తప్పనిసరిగా ఉండాలనే ఆలోచనతో మహిళలు సైతం చదువుకునేందుకు ముందుకొస్తున్నారు. ఇలాంటి వారందరికీ ఓపెన్ స్కూల్ విద్యావిధానం వరంలా మారింది. కనీస విద్యార్హత లేకున్నా తగిన వయస్సు ఉంటే పదో తరగతిలో చేరే అవకాశం ఉండగా.. ఆపై ఇంటర్ కూడా చదువుకునే వెసులుబాటు ఉండడంతో పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు.

రెగ్యులర్‌తో సమానంగా గుర్తింపు

రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా ఓపెన్ స్కూల్‌లో చదివిన వారికి కూడా గుర్తింపు లభిస్తుండటంతో చదువు మధ్యలో ఆపేసిన వారు ఆ దిశగా ముందుకు సాగుతున్నారు. చదువును మధ్యలోనే మానేసిన, కనీస విద్యార్హత లేకున్నా, వయసుతో సంబంధం లేకుండా చదువుకోవాలనే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఉన్నత విద్య అభ్యసించాలన్నా, డ్రైవింగ్ లైసెన్స్ ఇతర అవసరాలకు పదో తరగతి అవసరం కావడంతో ఇటువైపు మొగ్గు చూపుతున్నారు. 2008 విద్యాసంవత్సరంలో ఓపెన్ స్కూల్ విధానం ప్రారంభం కాగా.. 2008–09 నుంచి పదో తరగతి, 2010–11 నుంచి ఇంటర్మీడియట్ ప్రారంభించారు. 14 ఏళ్లు దాటిన వారు పదో తరగతికి, 15 ఏళ్లు నిండి పదో తరగతి పాసైన వారంతా ఇంటర్మీడియట్ చదువుకు అర్హత సాధిస్తుండగా.. వారాంతాలు, సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు.

55 కేంద్రాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లు మొత్తంగా 55 ఉన్నాయి. ఇందులో ఖమ్మం జిల్లాలో 22, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 పాఠశాలల్లో అభ్యసన కేంద్రాలు ఉండగా, ప్రతీ ఆదివారం, ఇతర సెలవు దినాల్లో కూడా బోధన సాగుతోంది. ఫీజు చెల్లించాక పుస్తకాలను ఉచితంగానే అందిస్తున్నారు. ఇదిలా ఉండగా గతేడాది పది, ఇంటర్‌లో ప్రవేశాలు పొందిన వారిలో పలువురు వయస్సు పైబడిన వారు కూడా ఉండడం ఓపెన్ స్కూల్‌పై ఆసక్తిని తెలియజేస్తోంది.

వచ్చే 10వ తేదీ వరకు గడువు

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందాలనుకునే వారు వచ్చే నెల 10వ తేదీలోగా అధ్యయన కేంద్రంలో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. అదే విధంగా అపరాధ రుసుంతో వచ్చే నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. www.telanganaopenschools.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. లేదంటే మీ సేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో సైతం రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు.


ఫీజుల వివరాలు ఇలా..

పదో తరగతికి ఓసీ పురుషులు రూ.1,550, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనార్టీలు, మహిళలు రూ.1,150 చెల్లించాలి. ఇక ఇంటర్మీడియట్‌కు ఓసీ పురుషులైతే రూ.1,800, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ దివ్యాంగులు రూ.1,500తో పాటు రిజిస్ట్రేషన్ ఫీజు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం సంబంధిత ధ్రువపత్రాలను అధ్యయన కేంద్రంలో సమర్పించాలి.

గత నాలుగేళ్లలో ప్రవేశాలు

ఖమ్మం జిల్లా				
కోర్సు	2019-20	2020-21	2021-22	2022-23
పదో తరగతి	797	1,590	1,154	770
ఇంటర్మీడియట్	742	1,199	1,344	995
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా				
కోర్సు	2019-20	2020-21	2021-22	2022-23
పదో తరగతి	840	1,579	1,426	671
ఇంటర్మీడియట్	607	987	1,093	856

సద్వినియోగం చేసుకోవాలి



ఉన్నత చదువులు చదవాలనుకునే వారికి ఓపెన్ స్కూల్ విధానం ఎంతగానో దోహదపడుతుంది. ఆసక్తి ఉన్న వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. చిన్నచిన్న పనులు చేసుకుంటున్న వారు, చిరుద్యోగులు, ఇళ్లలో ఉంటున్న మహిళలకు ఇది మంచి అవకాశం. ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ పూర్తిచేసిన పలువురు ఉన్నత విద్య పూర్తిచేసి జీవితంలో స్థిరపడుతున్నారు.

– మద్దినేని పాపారావు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

తెలుగు క్రైస్తవ పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా మురళీకృష్ణ

కల్లూరు: తెలుగు క్రైస్తవ పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షులుగా ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చెన్నూరుకు చెందిన తాటి మురళీకృష్ణ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పిడుగు విజయ్‌కుమార్ ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ శనివారం కల్లూరులో మాట్లాడుతూ క్రైస్తవుల హక్కుల సాధనకు పోరాడుతామని, అన్ని జిల్లాల్లో వేదిక కమిటీలను నియమిస్తామని తెలిపారు.



నియామకపత్రం అందుకుంటున్న మురళీకృష్ణ (ఎడమ)

చేతన ఫౌండేషన్ సేవలు అభినందనీయం

సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర, ఎమ్మెల్సీ మధు



బ్యాగులు, నోట్ బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ మధు

తల్లాడ: ఎన్‌ఆర్‌ఐల సహకారంతో చేతన ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. తల్లాడలోని రైతు వేదికలో శనివారం చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన 150 మంది అనాథ పిల్లలకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మాదినేని నరసింహారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ ప్రమాదాల్లో కాళ్లు కోల్పోయిన వెయ్యి మందికి కృత్రిమ కాళ్లు అందజేయడంతోపాటు కరోనా సమయంలో పేదలకు నిత్యావసర సరుకులు కూడా ఫౌండేషన్ బాధ్యులు అందజేశారని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ చేతన ఫౌండేషన్‌ను స్థాపించిన వెనిగళ్ల రవి, రేణుక అమెరికాలో ఉంటూనే ఇక్కడ పిల్లలకు చేయూతనివ్వడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, ఎంఈఓ ఎన్.దామోదరప్రసాద్‌తో పాటు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దూపాటి భద్రరాజు, దొడ్డా సీతారామయ్య, ఎం.నరసింహారావు, చంద్రకాని నవీన్, షేక్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ చట్టాలపై అవగాహన అవసరం

ఖమ్మంలీగల్: న్యాయసేవాధికార సంస్థ పరిధిలోని పారాలీగల్ వలంటీర్లు, న్యాయ విద్యార్థులు వ్యవసాయ చట్టాలపై అవగాహన పెంచుకుని రైతులకు అండగా నిలవాలని వ్యవసాయ చట్టాల నిష్ణాతుడు సునీల్ పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా అధ్యక్షతన వ్యవసాయ చట్టాలపై శనివారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సునీల్ మాట్లాడుతూ.. భూమికి సంబంధించి 124 చట్టాలు, వ్యవసాయానికి సంబంధించి 65 చట్టాలున్నాయని తెలిపారు. రైతు హక్కుల చట్టం, విత్తనాల చట్టం, వినియోగదారుల రక్షణ చట్టాలను వివరించిన ఆయన దోస విత్తనాలు మొలకెత్తని కేసులో సుప్రీంకోర్టు బాధిత రైతులకు రూ.20 లక్షల పరిహారాన్ని అందించిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే, గ్రామ నక్షా టిపన్, సేత్వారీ రికార్డులు, భూ హక్కులకు సంబంధించి ప్రామాణికాలను తెలిపారు. అటవీ హక్కుల చట్టాన్ని వివరిస్తూ 2005 డిసెంబర్ 13కు ముందు అటవీ భూమి ఆక్రమించిన గిరిజనులకు ఆ భూమి పది ఎకరాలకు తక్కువ ఉంటే ప్రభుత్వం పట్టా ఇస్తుందని వివరించారు. సదస్సులో మానేరు న్యాయ కళాశాల విద్యార్థులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

అటవీ అభివృద్ధి కార్పొరేషన్‌కు రూ.100 కోట్ల లాభాలు

- రాష్ట్రవ్యాప్తంగా 17 నూతన భవనాలు
- టీఎస్ఎఫ్‌డీసీ వీసీ, ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలో అటవీ అభివృద్ధి కార్పొరేషన్ గతేడాది రికార్డు స్థాయిలో రూ.100 కోట్ల లాభాలు ఆర్జించిందని.. ఈ ఏడాది రూ.200 కోట్లు లాభాలు గడిస్తామనే నమ్మకం ఉందని టీఎస్ఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండీ డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. సత్తుపల్లిలో రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న డివిజన్ కార్యాలయం, క్వార్టర్ల పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. 45 ఏళ్ల తర్వాత కార్పొరేషన్‌లో పాత భవనాలు తొలగించి రాష్ట్రవ్యాప్తంగా 17 కొత్త భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం జామాయిల్‌కు డిమాండ్ పెరిగిందని, డిసెంబర్‌లో టన్ను రూ.4,500 ఉంటే ఇప్పుడు రూ.6,100కు పెరిగిందని చెప్పారు. భవిష్యత్‌లో ధర మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. గతేడాది 3 లక్షల టన్నుల జామాయిల్ కర్రల విక్రయం, వెదురు ద్వారా రూ.16 కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు. అయితే, లాభాల్లో జామాయిల్‌దే ప్రధాన భూమిక అని, అటవీ అభివృద్ధి అధికారులు జామాయిల్ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో భద్రాద్రి డీఎఫ్ఓ లక్ష్మణ్‌రంజిత్‌నాయక్, సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.స్కైలాబ్, డీఎం వి.తనూజ, ప్లాంటేషన్ మేనేజర్లు బి.సైదానాయక్, చంద్రకళ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



క్వార్టర్ల పనులను పరిశీలిస్తున్న టీఎస్ఎఫ్‌డీసీ వీసీ చంద్రశేఖర్‌రెడ్డి